క్లుప్తంగా

నేటి నుంచి హనుమజ్జయంతి

కడప కల్చరల్ : కడప నగరం గడ్డిబజారులోని శ్రీ కామకోటి కళాంబ సమేత శ్రీ సోమసుందరేశ్వరస్వామి ఆలయంలో బుధ, గురువారాల్లో హనుమజ్జయంతి కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు అర్చకులు తెలిపారు. అందులో భాగంగా ఈనెల 21న విశేష పూజలు నిర్వహించనున్నట్లు తెలిపారు. 22న ఉదయం 7.30 గంటలకు గణపతిపూజ, మండపారాధన, కలశ స్నపనం, విశేష అలంకరణ, గణపతి హోమం, లక్ష్మీనారాయణ, రుద్ర, నవగ్రహ, అయ్యప్ప, సుదర్శన హోమాలు నిర్వహిస్తామని తెలిపారు. మహాపూర్ణాహుతి అనంతరం శ్రీ నాగవల్లీ దళార్చన, వడమాల, తీర్థ ప్రసాద వినియోగం నిర్వహిస్తామన్నారు.

తూకాల్లో మోసాలకు పాల్పడితే కఠిన చర్యలు


మాట్లాడుతున్న రవీంద్రారెడ్డి

కడప వైఎస్ఆర్ సర్కిల్: దుకాణదారులు తూకాల్లో మోసాలకు పాల్పడితే చర్యలు తప్పవని తూనికల కొలతల శాఖ జిల్లా అసిస్టెంట్ కంట్రోలర్ రవీంద్రారెడ్డి పేర్కొన్నారు. మంగళవారం వరల్డ్ మెట్రాలజీ డే సందర్భంగా నగరంలోని తూనికల కొలతల శాఖ కార్యాలయంలో వేడుకలను నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ లీగల్ మెట్రాలజీ చట్టం, రూల్స్ గురించి వివరించారు. ఈ కార్యక్రమంలో పెట్రోల్ పంపు, డీలర్, కిరాణా, ఐరన్ అండ్ స్టీల్ అసోసియేషన్ సభ్యులు పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో తూనికల కొలతలు ఇన్‌స్పెక్టర్ రమేష్ కుమార్ రెడ్డి సిబ్బంది పాల్గొన్నారు.

తహసీల్దార్ల ఆస్తులపై విచారణ చేపట్టాలి


ఏసీబీ కార్యాలయానికి వచ్చిన సీపీఐ బృందం

కడప అర్బన్ : రిజిస్ట్రేషన్ నిషేధిత జాబితా 22ఏలో ఉన్న భూముల ఫ్రీహోల్డ్‌లో అక్రమాలకు పాల్పడిన తహసీల్దార్లు ఆదాయానికి మించి ఆస్తులు కలిగి ఉండడంపై విచారణ జరిపి చర్యలు తీసుకోవాలి సీపీఐ జిల్లా కార్యదర్శి గాలి చంద్ర డిమాండ్ చేశారు. మంగళవారం ఈ మేరకు సీపీఐ బృందం పాత రిమ్స్‌లోని ఏసీబీ కార్యాలయానికి వెళ్లి అధికారులకు వినతిపత్రాన్ని సమర్పించింది. ఈ సందర్భంగా చంద్ర మాట్లాడుతూ ఫ్రీహోల్డ్‌లో జరిగిన అక్రమాలపై ప్రభుత్వం చేపట్టిన విచారణలో జిల్లాలో 13 మంది తహసీల్దార్లు అక్రమాలకు పాల్పడినట్టు, వారికి జిల్లా కలెక్టర్ షోకాజ్ నోటీసు జారీ చేసినట్లు ప్రకటన వెలువడిందన్నారు. ఈ నేపథ్యంలో తహసీల్దార్ల స్థాయిలో ప్రభుత్వ నిబంధనలకు విరుద్ధంగా ఫ్రీహోల్డ్ సిఫారసులు చేయడానికి భారీగా ముడుపులు తీసుకున్నట్లు అభియోగాలు కూడా ఉన్నాయన్నారు. ఈ కార్యక్రమంలో సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యులు ఎల్. నాగ సుబ్బారెడ్డి, వెంకట శివ, వేణుగోపాల్, బాదుల్లా , మద్దిలేటి, మునయ్య తదితరులు పాల్గొన్నారు.

నా స్థలానికి రక్షణగా చర్యలు తీసుకున్నా

కడప కార్పొరేషన్: కడప నగరంలోని మద్రాసు రోడ్డు సమీపంలో సర్వే నంబర్ 365/1 లో 0.11 సెంట్ల భూమిని తాను కొని రిజిస్టర్ చేసుకున్నానని కమలాపురానికి చెందిన రాజగోపాల్‌రెడ్డి తెలిపారు. ఈనెల 18వ తేదీ సిమెంటు రోడ్డుకు అడ్డంగా గోడ₹ అనే శీర్షికన వార్త ప్రచురితమైన నేపథ్యంలో ఆయన సోమవారం ఒక పత్రికా ప్రకటన విడుదల చేశారు. 2025 మార్చి 4వ తేదీన పట్టీమ్ విజయకుమారి ద్వారా తాను ఆ భూమిని కొనుగోలు చేశానని, దాని పక్కనే లే ఔట్ వాళ్లు ఇదే సర్వే నంబర్‌లోని 1.60 ఎకరాలకు కాంపౌండ్ వాల్ నిర్మించారని, దానిని కొందరు కూల్చి దారి ఏర్పాటు చేసుకొని, తాను కొన్న భూమిలో నకిలీ నివేశన పట్టాలను తయారు చేసుకొని ఇళ్లు నిర్మించుకున్నారన్నారు. నా స్థలానికి రక్షణగా, రాకపోకలను నిరోధించడానికి మాత్రమే గోడ నిర్మించానని తెలిపారు.

చోరీల నియంత్రణకు సహకరించాలి

బద్వేలు అర్బన్ : చోరీల నియంత్రణకు వ్యాపారస్తులు సహకరించాలని అర్బన్ సీఐ ఎం.రాజగోపాల్ పేర్కొన్నారు. మంగళవారం స్థానిక అర్బన్ స్టేషన్ ఆవరణలో ఆర్టీసీ బస్టాండు పరిసరాలలోని వ్యాపారస్తులకు చోరీల నియంత్రణకు తీసుకోవాల్సిన జాగ్రత్తలపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ చోరీల నియంత్రణకు ప్రతి వ్యాపారస్తుడు తమ దుకాణంలో సీసీ కెమెరాలు ఏర్పాటు చేయాలని సూచించారు. అలాగే అనుమానాస్పద వ్యక్తులు లేదా కొత్త వ్యక్తులు కనిపిస్తే వెంటనే సమాచారం ఇవ్వాలని సూచించారు. ముఖ్యంగా బస్సుల్లో ప్రయాణించే మహిళలు తమ వెంట విలువైన వస్తువులు తీసుకుపోరాదని కోరారు.

ప్రకృతి వ్యవసాయ విస్తరణకు కృషి


సమావేశంలో మాట్లాడుతున్న జిల్లా ప్రాజెక్టు మేనేజర్ ప్రవీణ్

కడప అగ్రికల్చర్: జిల్లాలో ప్రకృతి వ్యవసాయ విస్తరణకు ఐసిఆర్పీలు కృషి చేయాలని ప్రకృతి వ్యవసాయ జిల్లా ప్రాజెక్టు మేనేజర్ ప్రవీణ్ పేర్కొన్నారు. మంగళవారం కడప ప్రకృతి వ్యవసాయ కార్యాలయంలో ప్రకృతి వ్యవసాయ సిబ్బందికి ట్రినీ ఐసిఆర్పీ ఎంపిక విధానంపై అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా ప్రాజెక్టు మేనేజర్ మాట్లాడుతూ ట్రినీ ఐసిఆర్పీ ఎంపిక విధానంపై ప్రకృతి వ్యవసాయ సిబ్బందికి విధివిధానాలను తెలియ చేశారు. లీడ్ ఫార్మర్‌గా ఎంపికకు సంబంధించి సొంత నివాసమే ఉండాలన్నారు. అలాగే మహిళా సంఘంలో సభ్యురాలు అయి ఉండాలని చెప్పారు. దీంతోపాటు ప్రకృతి వ్యవసాయం మూడు సంవత్సరాలు అనుభవం కలిగి ఉండాలని తెలిపారు. కనీసం వయసు 25 నుండి 40 సంవత్సరాలు కలిగి ఉండటంతోపాటు 10 వ తరగతి ఉత్తీర్ణత కలిగి ఉండాలని తెలిపారు. అలాగే మొబైల్ ఆపరేటింగ్ యాప్ వినియోగం నైపుణ్యత కలిగి ఉండటంతోపాటు మహిళా రైతే ఉండాలని పేర్కొన్నారు. పై అర్హత కలిగి ఆసక్తి ఉన్నవారు తమ మండల పరిధిలో ప్రకృతి వ్యవసాయ సిబ్బందికి తెలియ జేయాలని సూచించారు.

రేపటి నుంచి పాటేమ్మ తిరునాల

పెండ్లిమర్రి : మండలంలోని చెన్నంరాజుపల్లెలో వెలసిన శ్రీపాటేమ్మ తిరునాల ఉత్సవాలు గురు, శుక్రవారం రెండు రోజుల పాటు వైభవంగా నిర్వహిస్తున్నట్లు ఆలయ నిర్వాహకులు తెలిపారు. గురువారం ఉదయం అమ్మవారికి గణపతి పూజ, ఆకుపూజ, ప్రత్యేక పూజలు నిర్వహిస్తామన్నారు. శుక్రవారం అభిషేకాలకరణ, తీర్థ ప్రసాదాలు, ఆలయ అవరణలో కోలాటం, ఆర్కెస్ట్రా, రాత్రికి గ్రామోత్సవం వంటి కార్యక్రమాలు ఏర్పాటు చేశామన్నారు.

రేపు బండలాగుడు పోటీలు

కాశినాయన : మండలంలోని ఉప్పలూరు గ్రామంలో శ్రీ అభయాంజనేయస్వామి తిరునాలను పురస్కరించుకుని గురువారం బండలాగుడు పోటీలు నిర్వహించనున్నట్లు ఆలయ నిర్వాహకులు తెలిపారు. మొదటి బహుమతి రూ.లక్ష, రెండవ బహుమతి రూ.70 వేలు, మూడవ బహుమతి రూ.40 వేలు, నాల్గవ బహుమతి రూ.20 వేలను గెలుపొందిన వృషభాలకు అందజేస్తామన్నారు. పోటీలో పాల్గొనే వారు గురువారం మధ్యాహ్నం 2 గంటలలోపు వెయ్యి రూపాయలు చెల్లించి రసీదు పొందాలన్నారు. వివరాలకు 94907 92999ను సంప్రదించాలని కోరారు.

మినీ మహానాడుకు ప్రవీణ్, లింగారెడ్డి వర్గీయుల డుమ్మా

ప్రొద్దుటూరు : ప్రొద్దుటూరు నియోజకవర్గానికి సంబంధించి మంగళవారం నిర్వహించిన టీడీపీ మినీ మహానాడు కార్యక్రమానికి పార్టీ నియోజకవర్గ మాజీ ఇన్‌చార్జి జీవీ ప్రవీణ్‌కుమార్‌రెడ్డి, మాజీ ఎమ్మెల్యే మల్లేల లింగారెడ్డితోపాటు వారి వర్గీయులు గైర్హాజరయ్యారు. గడిచిన ఎన్నికల నాటి నుంచి ఈ నేతల మధ్య సఖ్యత లేదు. పార్టీ కార్యక్రమాలకు కలిసి హాజరు కావడం లేదు. అదే రీతిలో ప్రస్తుతం మినీ మహానాడు కార్యక్రమానికి వీరు హాజరు కాకపోవడం గమనార్హం. ఈ నెలాఖరులో కడపలో జరిగే రాష్ట్రస్థాయి టీడీపీ మహానాడు కార్యక్రమంలో లింగారెడ్డి, ప్రవీణ్‌కుమార్‌రెడ్డిలకు ప్రాతినిధ్యం కల్పించారు. ఎమ్మెల్యే నంద్యాల వరదరాజులరెడ్డిని మహానాడుకు సంబంధించిన వసతి ఏర్పాట్ల కమిటీలో సభ్యునిగా, రవాణా కమిటీకి సంబంధించి మల్లెల లింగారెడ్డిని కమిటీ సభ్యునిగా, జీవీ ప్రవీణ్‌కుమార్‌రెడ్డిని వాహన పార్కింగ్ కమిటీ సభ్యునిగా నియమించారు. ప్రొద్దుటూరులో మాత్రం వీరికి ప్రాధాన్యత కల్పించలేదు.

జూదరులు అరెస్ట్

సింహాద్రిపురం : మండలంలోని అగ్రహారం గ్రామంలో జూదమాడుతున్నట్లు సమాచారం రావడంతో మంగళవారం ఎస్ఐ రవికుమార్ సిబ్బందితో దాడి చేశారు. ఏడు మందిని అరెస్టు చేసి వారి వద్ద నుంచి రూ.5,190లు స్వాధీనం చేసుకుని వారిపై కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ తెలిపారు. ఈ సందర్భంగా ఎస్ఐ మాట్లాడుతూ మండల ప్రజలు గ్రామాలలో ఎక్కడైనా అసాంఘిక కార్యకలాపాలు జరుగుతుంటే పోలీసులకు తెలపాలని, తెలిపిన వారి పేర్లను గోప్యంగా ఉంచుతామన్నారు. ఇందుకు ప్రజలు సహకరిస్తే అసాంఘిక కార్యకలాపాలపై ఉక్కు పాదం మోపి అణిచివేస్తామని ఆయన ప్రజలకు విజ్ఞప్తి చేశారు.

నేడు పసుపు, మామిడి వేలం

మైదుకూరు : మండలంలోని వనిపెంట కృషి విజ్ఞాన కేంద్రంలో బుధవారం పసుపు, మామిడి ఫలసాయాలను వేలం వేస్తున్నట్లు కేవీకే అధిపతి, శాస్త్రవేత్త డాక్టర్ ఎం.బాలకృష్ణ ఒక ప్రకటనలో తెలిపారు. బుధవారం ఉదయం 10 గంటలకు నిర్వహించే వేలంలో పాల్గొనే వారు రూ.100 చెల్లించి టోకెన్ తీసుకోవాలని ఆయన సూచించారు. ఆసక్తి గల రైతులు, రైతు ఉత్పత్తిదారుల సంఘాల సభ్యులు వేలంలో పాల్గొనాలని కోరారు. మరిన్ని వివరాలకు డాక్టర్ ఎం.బాలకృష్ణ 9985666503, డాక్టర్ శ్రీవిద్యారాణి 9398982828 నంబర్లకు సంప్రదించాలని తెలిపారు.

గండిలో పూజలు

చక్రాయపేట : గండి వీరాంజనేయస్వామి సన్నిధిలో హనుమజ్జయంతి వేడుకలు ఘనంగా ప్రారంభ మయ్యాయి. మంగళవారం వేదపారాయణం, యాగశాల ప్రవేశం, ద్వారాతోరణం, ఆరాధన, అగ్నిప్రతిష్ఠ హోమం, మూలమంత్ర హవనం తదితర కార్యక్రమాలు నిర్వహించినట్లు ఆలయ ప్రధాన ఉప ప్రధాన, ముఖ్య అర్చకులు కేసరి, రాజారమేష్, రాజగోపాలాచార్యులు తెలిపారు.

రేపు శోభాయాత్ర

ప్రొద్దుటూరు కల్చరల్ : హనుమత్ జయంతి సందర్భంగా హనుమాన్ శోభాయాత్ర నిర్వహించనున్నట్లు జై శ్రీరామ భక్త బృందం వ్యవస్థాపకుడు దశమందం బాబు తెలిపారు. ప్రెస్‌క్లబ్‌లో మంగళవారం ఆయన మాట్లాడుతూ హనుమాన్ జయంతి సందర్భంగా జై శ్రీరామ భక్త బృందం, దశమందం బ్రదర్స్ ఆధ్వర్యంలో నిర్వహించే శోభాయాత్ర గురువారం ఉదయం 8 కు పాత మార్కెట్‌లోని ఆంజనేయస్వామి ఆలయం నుంచి ప్రారంభమవుతుందన్నారు. దర్గా బజార్, సుందరాచార్యుల వీధి, గాంధీ రోడ్డు, బొల్లవరం ఆంజనేయస్వామి ఆలయం, టీబీ రోడ్డు, శివాలయం సెంటర్, మైదుకూరు రోడ్డులోని రిలయన్స్ పెట్రోలు బంకు, టూటౌన్ పోలీస్‌స్టేషన్ సమీపంలో అభయాంజనేయస్వామి ఆలయం వరకు కొనసాగుతుందన్నారు.

ఆర్డీఓ కార్యాలయం ఎదుట ధర్నా


ఆర్డీఓ కార్యాలయం ఎదుట ధర్నా చేస్తున్న కార్మిక సంఘాల నేతలు, కార్మికులు

కడప కోటిరెడ్డి సర్కిల్: కేంద్రంలోని నరేంద్రమోదీ మతోన్మాద ప్రభుత్వం భారతీయ కార్మిక వర్గాన్ని బానిసలుగా మార్చేందుకు నాలుగు లేబర్ కోడ్‌లు తెచ్చిందని ఏఐటీయూసీ, సీఐటీయూ నేతలు నాగ సుబ్బారెడ్డి, మనోహర్‌లు ధ్వజమెత్తారు. కార్మికులకు కనీస వేతనం రూ.26 వేలు చెల్లించాలని, కార్మిక వ్యతిరేక 4 లేబర్ కోడ్స్ రద్దుచేయాలని కోరుతూ కార్మిక సంఘాల కేంద్ర కమిటీ పిలుపుమేరకు మంగళవారం కడప ఆర్డీఓ కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ బ్రిటిష్ వారితో కార్మికవర్గం పోరాడి సాధించుకున్న కార్మిక చట్టాలను కాలరాసేలా వ్యవహరించడం తగదన్నారు. కేంద్రం తీసుకొచ్చిన లేబర్ కోడ్‌ల వల్ల కార్పొరేట్ల లాభాలు పెరిగి, కార్మికులు ఏ హక్కులు లేని బానిసలుగా మారిపోతారని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో ఏఐటీయూసీ జిల్లా అధ్యక్షులు వేణుగోపాల్, ఏపీ రైతు సంఘం జిల్లా కార్యదర్శి దస్తగిరిరెడ్డి, వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి అన్వేష్, సీఐటీయూ నగర అధ్యక్ష కార్యదర్శులు చంద్రారెడ్డి, వెంకటసుబ్బయ్య, అంగన్వాడి యూనియన్ జిల్లా కార్యదర్శి బి లక్ష్మీదేవి తదితరులు పాల్గొన్నారు.

ఆర్టీసీ డ్రైవర్లు రోడ్డు భద్రత నియమాలు పాటించాలి


డ్రైవర్లకు సూచనలు చేస్తున్న ట్రాఫిక్ సీఐ జావీద్

కడప కోటిరెడ్డిసర్కిల్ : ఆర్టీసీ డ్రైవర్లుగా విధులు నిర్వర్తిస్తున్న వారు రోడ్డు భద్రత నియయాలు పాటిస్తూ సంస్థను ప్రమాద రహిత సంస్థగా నిలిపేందుకు కృషి చేయాలని కడప ట్రాఫిక్ సీఐ జావీద్ పిలుపునిచ్చారు. మంగళవారం స్థానిక ఆర్టీసీ ఆర్ఎం కార్యాలయ కాన్ఫరెన్స్ హాలులో ఫిర్యాదులు వచ్చిన డ్రైవర్లకు శిక్షణా కార్యక్రమం నిర్వహించారు. తొలుత ఓం శాంతి సంస్థ అక్కయ్యచే మానసిక ప్రశాంతత కోసం యోగ, ధ్యానం చేయించారు. ఈ సందర్భంగా ట్రాఫిక్ సీఐ జావీద్ మాట్లాడుతూ డ్రైవర్లు విధి నిర్వహణ సమయంలో అప్రమత్తంగా ఉంటూ బస్సులను నడపాలన్నారు. ముఖ్యంగా ర్యాష్ డ్రైవింగ్, సెల్‌ఫోన్ డ్రైవింగ్‌కు దూరంగా ఉండాలన్నారు. డ్రైవర్ల సహకారంతోనే సంస్థను ప్రమాద రహిత సంస్థగా మార్చేందుకు వీలు కలుగుతుందని ఆయన వివరించారు. అనంతరం జిల్లా ప్రజా రవాణాధికారి పొలిమేర గోపాల్‌రెడ్డి సురక్షితమైన డ్రైవింగ్‌పై దిశా నిర్దేశం చేశారు. ముఖ్యంగా వర్షాకాలంలో పాటించాల్సిన చర్యలను తెలియజేశారు. బద్వేలు డిపో మేనేజర్ ఆర్‌సీ నిరంజన్ ఇంధన పొదుపుపై పంచసూత్రాలను వివరించారు. మధ్యాహ్నం డ్రైవర్లకు బ్లాక్ స్పాట్ పై అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో అధికారులు కృష్ణారెడ్డి, జబ్బార్, కడప రీజియన్‌లోని వివిధ డిపోలకు చెందిన 26 మంది డ్రైవర్లు పాల్గొన్నారు.



లీకేజీ అరికట్టండి

కడప కార్పొరేషన్: కడప నగరం రామాంజనేయపురంలో పీఎఫ్ క్వార్టర్స్‌కు పోయే మార్గంలో కడపకు తాగునీరు అందించే ప్రధాన పైపులైన్ లీకేజీ అయింది. సుమారు నెల రోజులుగా నీరు వృథా అవుతున్నా నగరపాలక సిబ్బంది పట్టించుకున్న పాపాన పోలేదని స్థానికులు చెబుతున్నారు. శివానీ హోటల్ పక్కన చెట్టుకింద ఏర్పడిన ఈ చిన్న లీకేజీ ఇప్పుడు పెద్దగా మారి రోడ్డుపై నీరు నిలబడుతోంది. ఇప్పటికైనా స్పందించి పైపులైన్‌ను బాగు చేయాలని స్థానిక ప్రజలు కోరుతున్నారు.

రేపు వీరాంజనేయస్వామి తిరునాల


వీరాంజనేయస్వామి దేవాలయం

చాపాడు: మండల పరిధిలోని విశ్వనాథపురంలో ప్రసిద్ధి చెందిన శ్రీ వీరాంజనేయస్వామి దేవాలయ సన్నిధిలో ఈ నెల 22, 23వ తేదీలలో శ్రీవీరాంజనేయస్వామి(33వ) జయంతోత్సవ వేడుకలు ఘనంగా నిర్వహించనున్నారు. గురువారం ఉదయం వీరాంజనేయస్వామి సన్నిధిలో ఉదయం 5గంటల నుంచి సుప్రభాత సేవతో మొదలై శుక్రవారం రాత్రి వరకూ పంచామృతాభిషేకంలు, అలంకారం, సహస్రనామార్చన, హనుమాన్ జపము, గణపతి పూజ, పుణ్యావాహచనం, పంచకవ్యప్రోక్షణ మన్య సూక్తపారాయణ, గణపతి హోమం మహామంగళహారతి, తీర్థ ప్రసాదములు వినియోగం జరుతుందన్నారు. రెండు రోజుల పాటు భక్తులకు ఆలయం వద్ద అన్నదాన కార్యక్రమం నిర్వహించనున్నారు.

23న బంగలాగుడు పోటీలు..

వీరాంజనేయస్వామి జయంతోత్సవ వేడుకలను పురస్కరించుకుని శుక్రవారం మధ్యాహ్నం 3 నుంచి ఒల్లు కేటగిరి ఎడ్లకు బండలాగుడు పోటీలు నిర్వహించనున్నారు. ఈ పోటీలలో గెలుపొందిన ఎద్దుల ఎజమానులకు రూ.70వేలు, రూ.50వేలు, రూ,40వేలు, రూ.30వేలు, రూ.20వేలు, రూ.10 వేలు, రూ.5వేల చొప్పున నగదు అందజేయనున్నట్లు నిర్వాహకులు తెలియజేశారు.

అధికార పార్టీ అండతో దళితులపై దాడులు


మైదుకూరు రోడ్డులోని అంబేద్కర్ విగ్రహం వద్ద నిరసన వ్యక్తం చేస్తున్న ప్రజా సంఘాల నాయకులు

ప్రొద్దుటూరు : అధికార పార్టీ నాయకుల అండతో రాష్ట్రంలో దళితులపై దాడులు జరుగుతున్నాయని ఏపీ దళిత సమాఖ్య రాష్ట్ర అధ్యక్షుడు కొత్తపల్లె యల్లయ్య మాదిగ తెలిపారు. స్థానిక మైదుకూరు రోడ్డులోని డాక్టర్ బీఆర్ అంబేద్కర్ విగ్రహం వద్ద మంగళవారం ఏపీ దళిత సమాఖ్య ఆధ్వర్యంలో నిరసన తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తిరుపతి ఇంజనీరింగ్ కాలేజీలో నెల్లూరు జిల్లాకు చెందిన జేమ్స్ బీటెక్ చదువుతున్నాడన్నారు. జేమ్స్‌ను అగ్రవర్ణ విద్యార్థులు అవమానాలు చేసి హింసించారన్నారు. తనను హింసించిన గోపి, నాని, యశ్వంత్ నాయుడు తదితరులపై జేమ్స్ పోలీసులకు ఫిర్యాదు చేశాడన్నారు. పోలీసులు వారికి నచ్చే విధంగా మరో ఫిర్యాదును రాయించుకుని కేసును నీరుగార్చే ప్రయత్నం చేస్తున్నారన్నారు. ఎస్సీ, ఎస్టీ ఫిర్యాదులను నిర్లక్ష్యం చేసినా, తారుమారు చేసిన పోలీసులు కూడా నిందితులు అవుతారని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో ఆర్ఎంఎస్ కన్వీనర్ లక్ష్మీదేవి, ఏపీ దళిత సమాఖ్య జిల్లా అధ్యక్షుడు బి.జయన్న, బొద్దు బాలకుమార్, మహాజన రాష్ట్ర సమితి అధ్యక్షుడు వై.చంద్రశేఖర్, హ్యూమన్ రైట్స్ ప్రొటెక్షన్ రాష్ట్ర నాయకుడు వెంకటన్న, బహుజన సమాఖ్య ప్రొద్దుటూరు నాయకుడు దొరస్వామి నాయక్, రఘుపతి నాయక్, జయరాం నాయక్, చిన్నయ్య, ఎమ్మార్పీఎస్ నాయకుడు గద్దం నరసింహులు మాదిగ, రాయలసీమ పరిరక్షణ సమితి నాయకుడు ఎం.ప్రతాప్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

రైతులకు వెంటనే డబ్బులు చెల్లించాలి


చీనీ కాయల వేలంపాట పరిశీలిస్తున్న మార్కెటింగ్ శాఖ రీజనల్ డిప్యూటీ డైరెక్టర్ శ్రీకాంత్‌రెడ్డి

పులివెందుల రూరల్ : పట్టణంలోని చీని కాయల మార్కెట్‌కు రైతుల దగ్గర నుంచి వ్యాపారస్తులు చీని కాయలు కొనుగోలు చేసిన వెంటనే రైతులకు డబ్బులు చెల్లించాలని మార్కెటింగ్ శాఖ రీజినల్ డిప్యూటీ డైరెక్టర్ శ్రీకాంత్‌రెడ్డి తెలిపారు. మంగళవారం పట్టణంలోని స్థానిక చీనీ కాయల మార్కెట్‌లో వేలంపాట నిర్వహించే కార్యక్రమాన్ని ఆయన పరిశీలించి మాట్లాడారు. ఇతర జిల్లాలతోపాటు ఇతర రాష్ట్రాలలో ఏ విధంగా ఉన్నాయో అదేవిధంగా పులివెందుల చీని కాయల మార్కెట్‌లో ధరలు ఉండే విధంగా తగిన చర్యలు తీసుకోవాలని సంబంధిత అధికారులకు సూచించారు. సూట్ విధానం లేకుండా వ్యాపారాలు చేయాలన్నారు. అనంతరం మార్కెట్‌ను పరిశీలించి చీని వేలంపాట ఏ విధంగా జరుగుతుంది, ఏ విధంగా నిర్వహించాలనే దానిపైన వ్యాపారస్తులకు, రైతులకు సూచనలు ఇచ్చారు. కార్యక్రమంలో ఏడీ ఆజాద్‌వల్లి, సెక్రటరీ శ్రీధర్‌రెడ్డి, ట్రేడర్స్ రమణారెడ్డి, సూరారెడ్డి, మనోహర్ రెడ్డి, సాదక్‌వల్లి, తదితరులు పాల్గొన్నారు.

కార్మిక చట్టాలను పాత పద్ధతిలోనే కొనసాగించాలి

ప్రొద్దుటూరు రూరల్ : కార్మిక చట్టాలను పాత పద్ధతిలోనే కొనసాగించాలని సీఐటీయూ జిల్లా కార్యదర్శి సత్యనారాయణ డిమాండ్ చేశారు. మంగళవారం పాత బస్టాండ్ నుంచి శివాలయం సర్కిల్ వరకు సీఐటీయూ ఆధ్వర్యంలో కార్మికులతో ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 8 గంటల పని రద్దు చేసి 12 గంటలకు పెంచాలనే ఆలోచనలో బీజేపీ ప్రభుత్వం ఉందని, దీనిని కార్మికులు తిప్పికొట్టేందుకు సిద్ధంగా ఉన్నారు. ప్రభుత్వ సంస్థలతో ముడిపడి పనిచేస్తున్న ప్రతి కార్మికుడికి రూ.26వేలు వేతనం ఇవ్వడంతోపాటు ఉద్యోగ భద్రత కల్పించాలన్నారు. ఈ కార్యక్రమంలో సీఐటీయూ కార్యదర్శి విజయకుమార్, బాబు, పక్కీరయ్య, శేఖర్, మున్సిపల్ యూనియన్ కార్యదర్శి సాల్మన్ పాల్గొన్నారు.

సైనిక్ స్కూల్‌కు అనుమతులు మంజూరు


పాఠశాల చైర్మన్, ఫ్యాప్టో నాయకులతో పోస్టర్‌ను విడుదల చేస్తున్న ఎమ్మెల్సీ రామచంద్రారెడ్డి

కడప ఎడ్యుకేషన్: బాపట్ల జిల్లాలోని తెనాలి సమీపంలో చిలుమూరులో నెలకొల్పిన శ్రీరామా గురుకుల పాఠశాలకు సైనిక్ స్కూల్ ఏర్పాటుకు అనుమతులు మంజూరైనట్లు ఉపాధ్యాయ ఎమ్మెల్సీ యంవీ రామచంద్రారెడ్డి తెలిపారు. మంగళవారం కడపలోని సాయిబాబా హైస్కూల్‌లో ఆ పాఠశాల చైర్మన్ కొలసాని తులసీ విష్ణుప్రసాద్‌తో కలిసి అడ్మిషన్ల పోస్టర్స్‌ను విడుదల చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దేశవ్యాప్తంగా 33 సైనిక్ పాఠశాలలు ఉండగా నూతనంగా ఏపీ నుంచి రెండు పాఠశాలలకు మాత్రమే అనుమతులు మంజూరయ్యాయన్నారు. అందులో ఒకటి శ్రీరామా గురుకుల పాఠశాల అన్నారు. 2025-26 విద్యా సంవత్సరంలో 6వ తరగతికి అడ్మిషన్లకు అనుమతులు పొందినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో అపూస్మ జిల్లా అధ్యక్షుడు గంగయ్య, వర్కింగ్ ప్రెసిడెంట్ సుబ్బయ్య, ట్రెజరర్ నాగసుబ్బారెడ్డి, రాష్ట్ర కార్యవర్గ సభ్యులు సుధాకర్ తదితరులు పాల్గొన్నారు.

ఘన నివాళి


రామస్వామి విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులు అర్పిస్తున్న ఆర్జేయూపీ నాయకులు

కడప ఎడ్యుకేషన్: నేటి తరం ఉపాధ్యాయులకు ఆదర్శప్రాయుడు జాతీయ ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు గ్రహీత దివంగత కొర్రపాటి రామస్వామి అని ఆర్జేయూపీ రాష్ట్ర అధ్యక్షుడు డా.గునిసెట్టి శ్రీనివాసులు అన్నారు. రామస్వామి పదవ వర్ధంతి సందర్భంగా మంగళవారం కడప మద్రాస్ రోడ్డులోని భుజంగరావు స్మారక టీచర్స్ హోంలో ఆయన విగ్రహానికి పూలమాల వేసి ఘనంగా నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రామస్వామి జీవితాంతం ఉపాధ్యాయుల సేవలోనే ఉంటూ, జీవోల రామస్వామిగా అందరి మన్ననలు పొందారన్నారు. అలాంటి ఉత్తమ ఉపాధ్యాయుడు నేటి ఉపాధ్యాయ లోకానికి ఆదర్శప్రాయుడన్నారు. ఈ కార్యక్రమంలో టీచర్స్ హోం ప్రధాన కార్యదర్శి వెంకట సుబ్బయ్య, సహాధ్యక్షులు వీరన్న, ఉపాధ్యక్షులు ఆంజనేయులు తదితరులు పాల్గొన్నారు.

దళిత విద్యార్థిపై దాడి చేయడం దుర్మార్గం



మాట్లాడుతున్న పీడీఎస్‌యూ నాయకులు

కడప ఎడ్యుకేషన్: తిరుపతి ఇంజనీరింగ్ కాలేజీలో జేమ్స్ అనే దళిత విద్యార్థిని చిత్రహింసలకు గురిచేయడం దుర్మార్గం అని ఎపీడీఎస్‌యూ రాష్ట్ర ఉపాధ్యక్షుడు ఎం.అంకన్న అన్నారు. కడప జిల్లా కేంద్రం పీడీఎస్‌యూ రాయలసీమ ప్రాంతీయ కార్యాలయంలో మంగళవారం ఆయన మాట్లాడుతూ ఈ దుర్మార్గానికి పాల్పడిన వారిపై కేసులు నమోదు చేయాలని డిమాండ్ చేశారు. రుయా ఆస్పత్రిలో చేరిన బాధిత విద్యార్థి జేమ్స్‌కు మెరుగైన వైద్యం అందించాలన్నారు. రౌడీషీటర్ అండ్ గ్యాంగ్ పై తిరుచానూరు పోలీసులు నామమాత్రపు కేసు నమోదు చేయడం సిగ్గు చేటని మండిపడ్డారు. కులం పేరుతో దూషించి చంపేందుకు కుట్ర చేసిన వారి పై హత్యాయత్నం, ఎస్సీ,ఎస్టీ అట్రాసిటీ కేసు నమోదు చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో పీడీఎస్‌యూ నగర నాయకులు వెంకటేష్ పాల్గొన్నారు.

భారత సైనికులకు ప్రతి ఒక్కరూ అండగా ఉండాలి

వేంపల్లె : దేశంలోని ప్రజల క్షేమం కోసం పోరాడుతున్న భారత సైనికులకు ప్రతి ఒక్కరూ అండగా ఉండాలని పలువురు వక్తలు పేర్కొన్నారు. ఆపరేషన్ సిందూర్ విజయోత్సవాన్ని పురస్కరించుకుని మంగళవారం వేంపల్లెలో బీజేపీ నేతలు, ప్రజలు, మాజీ ఆర్మీ సైనికుల ఆధ్వర్యంలో తిరంగా ర్యాలీని నిర్వహించారు. భారత దేశ త్రివర్ణ పతాకాన్ని పట్టుకుని స్థానిక ఆర్టీసీ బస్టాండ్ నుంచి నాలుగు రోడ్ల కూడలి వరకు ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా పలువురు వక్తలు మాట్లాడుతూ దేశాన్ని గొప్ప సేవలు అందిస్తున్న భారత సైనికుల గొప్పతనాన్ని అభినందిస్తూ తిరంగా ర్యాలీని చేపట్టడం సంతోషకరమని, పాకిస్తాన్ ఉగ్రవాదాన్ని ఊచకోత కోసిన భారత త్రివిధ దళాలకు ప్రతి భారతీయుడు అభినందనలు తెలపాలన్నారు.

నేత్రదానం చేయాలి

పులివెందుల రూరల్ : అంధ రహిత సమాజం కోసం ప్రతి ఒక్కరూ నేత్రదానం చేయాలని నేత్ర సేకరణ కేంద్రం అధ్యక్షుడు రాజు తెలిపారు. మంగళవారం పట్టణంలోని స్థానిక చిన్నన్నరూముల వీధిలోని నివాసముంటున్న ప్రభుత్వ జూనియర్ కళాశాల రిటైర్డు ప్రిన్సిపాల్ అన్నారెడ్డి బాలిరెడ్డి మృతి చెందారు. దీంతో మృతుని భార్య వెంకటలక్షుమ్మ, కుటుంబ సభ్యులు నేత్రదానానికి అంగీకరిస్తూ జిల్లా అంధత్వ నివారణ సంస్థ, నేత్ర సేకరణ కేంద్రం అధ్యక్షుడు రాజుకు సమాచారమిచ్చారు. టెక్నిషియన్ హరీష్‌తో కలిసి మృతుని నివాసానికి వెళ్లి మృతదేహం నుంచి కార్నియాలను సేకరించి హైదరాబాద్‌లోని డాక్టర్ అగర్వాల్ నేత్ర నిధికి పంపించారు. ఈ సందర్భంగా నేత్ర సేకరణ కేంద్రం అధ్యక్షుడు మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ నేత్రదానంపై అవగాహన కలిగి 9966509364, 7093204537 అనే ఫోన్ నెంబర్లకు సమాచారమివ్వాలన్నారు.